సాక్షి
విశాఖపట్నం

సోమవారం ౹ 13 ౹ అక్టోబర్ ౹ 2025



అడ్డగోలు నిల్వలు.. అనుమతిలేని అమ్మకాలు 8లో

వాటే బ్యాటింగ్...!



విశాఖ స్పోర్ట్స్: టీం ఇండియా భారీ స్కోరు.. కంగారూలను కలవరపెట్టడం ఖాయం అనుకున్న అభిమానులకు.. ప్రొఫెషనల్ ఆటకు బ్రాండ్ మేమే అన్నట్టు ఆస్ట్రేలియా బ్యాటర్లు పరుగుల వరద సృష్టించారు. భారత బౌలర్లను చీల్చి చెండాడారు. కళ్లు చెదిరే బౌండరీలు..బంతికి చుక్కలు చూపించేలా సిక్సర్లతో మోత మోగించారు. ఆస్ట్రేలియా సారథి అలిస్సా హీలీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.






8లో



విద్యుత్ డీఈల కిరికిరి

- మధురవాడ సర్వే నెం.296/14లో 5.33 ఎకరాలకు స్కెచ్
- నకిలీ సర్వే నంబర్ సృష్టించి..ఆన్‌లైన్‌లో నమోదు
- సహకరించిన సర్వేశాఖ అధికారులు
- 296/6లోని భూమిని ఆక్రమించేందుకు యత్నం
- రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : ప్రభుత్వ భూమిని ప్రైవేటు ల్యాండ్‌గా నమ్మించి ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించేందుకు యత్నించడంతో పాటు నకిలీ ఈసీలు సృష్టించిన విద్యుత్‌శాఖ డీఈల ముఠా.. ఇప్పుడు అసలు ఉనికిలోలేని సర్వే నంబరునే సృష్టించారు. ఇందుకోసం ఏకంగా ఆన్‌లైన్‌లో కూడా సర్వే నంబరు ఉన్నట్టు మార్పులు చేశారు. అక్కడితో ఆగకుండా.. ఈ సర్వే నంబరులో ఏకంగా 5.33 ఎకరాల భూమి ఉందని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ వ్యవహారంలో సర్వేశాఖ అధికారులు కూడా ఈ ముఠాకు సహకరించినట్టు తెలుస్తోంది. అయితే, లేని సర్వే నంబరును సృష్టించినందున.. మరో సర్వే నంబరులోని భూమిని ఇందులో చూపించేందుకు అనుగుణంగా ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ)లో మార్పులు చేసేందుకు యత్నించారు. తద్వారా మధురవాడలో అత్యంత విలువ చేసే 5.33 ఎకరాల భూమిని తమ చేతుల్లోకి తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించేందుకు కొద్ది మంది అధికారులతో లావాదేవీలు కూడా మాట్లాడుకున్నట్టు సమాచారం. వాస్తవానికి తమ శాఖలోనే వివిధ ప్రాంతాల్లో పనిచేసే సిబ్బంది నుంచి మొత్తం రూ.25 లక్షల చొప్పున 200 మంది నుంచి రూ.50 కోట్లు వసూలు చేశారు. వీరందరికీ ఇప్పుడు ఈ సర్వే నంబరులోని భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామంటూ చెబుతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా భూమి లేని లేని సర్వే నంబరును సృష్టించడమే కాకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేయించేందుకు యత్నించిన వ్యవహారంలో సదరు డీఈలు... తమకు మంత్రి అచ్చెన్నాయుడు తెలుసంటూ సహచర ఉద్యోగుల వద్ద చెబుతున్నట్టు తెలుస్తోంది.

ఖాళీగా ఉండటంతో....

మధురవాడలోని సర్వే నంబరు 296 సర్వే నంబరు భూమి... స్టేడియంకు ఎదురుగా ఉన్న ఎంవీవీ సిటీకి పక్కనే ఉంది. ఇక్కడ ఎకరా భూమి విలువ రూ. 10 కోట్లు పలుకుతోంది. ఈ భూమిపై కన్నేసిన సదరు ముఠా.... 296/6లో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని రెండు ముక్కలుగా చేసి 296/14 సర్వే నంబరును సృష్టించారు. ఇందులో 5.33 ఎకరాల భూమి ఉన్నట్టు ఏకంగా ఆన్‌లైన్‌లోకి ఎక్కించారు. ఈ భూమి ఉన్నట్టు ఆన్‌లైన్‌లో ఎక్కించడంలో నేరుగా సర్వేశాఖ అధికారుల పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది. సర్వేశాఖ ఏడీ ఒకరు నేరుగా ఇందులో ప్రధాన పాత్ర పోషించినట్టు సమాచారం. ఖాళీగా ఉండటంతో పాటు కుటుంబంలో తగాదాలతో వ్యవహారం కోర్టులో ఉండటం వీరికి కలిసొచ్చింది. అంతేకాకుండా సదరు కుటుంబం అంతా హైదరాబాద్‌లోనే మరో ప్రాంతంలోనే నివాసం ఉండటంతో ఇటువైపు గమనించే పరిస్థితి లేకపోవడాన్ని ఈ ముఠా అలుసుగా తీసుకున్నట్టు తెలుస్తోంది. అసలు ఉనికిలోలేని ఈ భూమిని చూపించి తాము వసూలు చేసిన రూ. 50 కోట్లలో కొందరికి ఇక్కడ భూమి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని సదరు ముఠా నమ్మిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా శ్రీకాకుళం జిల్లాకు చెందిన డీఈలు... తాము మంత్రి అచ్చెన్నాయుడు బంధువులంటూ చెప్పుకుంటుండటం గమనార్హం.



సర్వే నంబర్ 296/114 అనేది లేదని స్పష్టం చేస్తున్న ఎఫ్ఎంబీ స్కెచ్



సర్వే నంబర్ 296/13 వరకే ఉన్నాయని తహసీల్దార్ ఇచ్చిన నివేదిక ఇది



296/14 ఉన్నట్టు తయారు చేసిన నకిలీ ఎఫ్ఎంబీ

సర్వే నంబరు సృష్టించారు ఇలా...!

మధురవాడలోని సర్వే నంబరు 296 సర్వే నంబరులో మొత్తం 50.44 ఎకరాల భూమి ఉంది. అయితే, ఈ సర్వే నంబరులో ఇప్పటివరకు కేవలం 13 సబ్ డివిజన్లు... అంటే 296/1 నుంచి 296/13 వరకూ ఉన్నాయి. ఆయా సబ్ డివిజన్లల్లో ఎవరెవరికి భూమిని కేటాయించారనే వివరాలను కూడా స్పష్టంగా స్థానిక రూరల్ తహసీల్దారు తన నివేదికలో పేర్కొన్నారు. అయితే ఇప్పుడు అసలు ఉనికిలోనే లేని 296/14 సర్వే నంబరును సదరు ముఠా సృష్టించింది. ఇందుకోసం ఏకంగా ఆన్‌లైన్‌లోనే మార్పులు చేశారు. అంతేకాకుండా ఈ సర్వే నంబరులో 5.33 ఎకరాల భూమి ఉందని కూడా పేర్కొన్నారు. అయితే లేని భూమిని ఈ సర్వే నంబరులో చేర్చేందుకుగానూ 296/6లో ఉన్న 7.40 ఎకరాల భూమిపై కన్ను పడింది. వాస్తవానికి ఈ భూమికి పట్టా ఇచ్చారు. అయితే, కుటుంబ తగాదాల వల్ల ఈ వ్యవహారం ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది. అందువల్ల ఈ సైట్‌లో ఎవ్వరూ ఉండటం లేదు. ప్రస్తుతానికి ఈ సర్వే నంబరులోని భూమి ఖాళీగా ఉంది. ఈ ఖాళీ భూమిపై సదరు ముఠా కన్నేసింది. ఈ సర్వే నంబరుకు చెందిన భూమిలోని 5.33 ఎకరాలకు 296/14 సర్వే నంబరులో ఉన్నట్టు చేర్చారు. అంతేకాకుండా ఇందుకు అనుగుణంగా ఎఫ్ఎంబీలోనూ మార్పులు చేసేందుకు యత్నించారు.

ఈపీడీసీఎల్‌లోనూ వసూళ్లు...!

జెన్‌కోకు చెందిన విజయవాడలోని ఇబ్రహీంపట్నంలోని వీటీపీఎస్‌తో పాటు విద్యుత్ సౌధలో అడ్మిన్ విభాగంలో పనిచేస్తున్న ఈ ఇద్దరు డీఈలు... జెన్‌కోలోని తమ తోటి ఉద్యోగులతో పాటు వైఎస్సార్ కడప జిల్లాలోని రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటు (ఆర్‌టీపీపీ), కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్లాంటు, ట్రాన్స్‌కోలో పనిచేసే ఉద్యోగులతో పాటు విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో పని చేసే ఉద్యోగుల నుంచి కూడా చెరో రూ. 25 లక్షల చొప్పున వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఈ విధంగా మొత్తం 200 మంది నుంచి రూ. 50 కోట్లు వసూలు చేశారు. అంతేకాకుండా మధురవాడలోని సర్వే నెంబరు 296/14లోని భూమిని తమ బంధువుల పేరు మీద జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) చేసుకున్నట్టు కూడా చెబుతున్నట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులతో వ్యవహారం మాట్లాడుతున్నట్టు సమాచారం.

పాలకులు వదిలేశారు.. యువకులు సరిచేశారు

రహదారులపై గుంతలు పూడ్చిన యువత

మల్కాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రోడ్లను మెరుగుపరుస్తామని, సంక్రాంతి నాటికి రోడ్లు తళతళా మెరుస్తాయని హామీ ఇచ్చింది. కానీ సంక్రాంతి, దసరా పండుగలు ముగిసి, దీపావళి వచ్చేస్తున్నా రహదారుల పరిస్థితి మాత్రం ఏమాత్రం మెరుగుపడలేదు. గుంతలను పూడ్చే ప్రయత్నం కూడా చేయకపోయింది. ఈ నేపథ్యంలో రోడ్ల దుస్థితిని చూసి విసుగు చెందిన మల్కాపురం ప్రాంత యువకులు నడుం బిగించారు. తలో కొంత డబ్బులు వేసుకుని, సిమెంట్, కాంక్రీట్ కొనుగోలు చేసి ప్రమాదకరమైన గుంతలను పూడ్చి, తమ ప్రాంత ప్రజలకు తామే ఉపశమనం కలిగించారు. మల్కాపురం ప్రధాన సర్వీసు రోడ్డులో.. ముఖ్యంగా కోస్ట్ గార్డ్ కార్యాలయం వైపు వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళల్లో వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో యువకులే స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చారు.



సర్వీసు రోడ్డులో గుంతలను పూడ్చుతున్న యువత

నేడు కొత్త ఉపాధ్యాయులు పాఠశాలల్లో చేరాలి

ఆరిలోవ: డీఎస్సీ–2025 ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇటీవల నియామకమైన 1,139 మంది కొత్త ఉపాధ్యాయులు సోమవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్ తెలిపారు. నియామకమైన వారికి ఇటీవల విద్యాశాఖ అధికారులు కొద్దిరోజులు శిక్షణ ఇచ్చారు. అనంతరం వారికి రెండు రోజులపాటు పారదర్శకంగా కౌన్సెలింగ్ నిర్వహించి, పనిచేయాల్సిన పాఠశాలలను కేటాయించారు. ర్యాంకుల వారీగా కొత్త ఉపాధ్యాయులను గ్రామీణ, గిరిజన ప్రాంతాలలోని పాఠశాలల్లో భర్తీ చేసినట్లు డీఈవో స్పష్టం చేశారు. అయితే పట్టణ ప్రాంతాల్లో ఖాళీలు ఉన్నప్పటికీ, మెరిట్‌లో ఉన్న తమతో సహా అందరినీ గ్రామీణ, గిరిజన ప్రాంతాల పాఠశాలలకు పంపించడంపై కొందరు కొత్త ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ నేడు

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని చెప్పారు.



అదరగొట్టిన గ్లామ్ రన్ వే... 8లో

విశాఖ దశ దిశ మారేలా అభివృద్ధి ప్రణాళికలు

అధికారుల సమావేశంలో మంత్రి లోకేష్

మహారాణిపేట: రానున్న 30 ఏళ్ల భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని విశాఖ దశ దిశ మారేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ హాలులో ఉత్తరాంధ్ర జిల్లాల (విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం) అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ వివరాలను విలేకరుల సమావేశంలో మంత్రి లోకేశ్ వివరించారు. బెంగళూరు, పుణె వంటి నగరాల్లో ట్రాఫిక్ సమస్యలు ఇక్కడ ఉత్పన్నం కాకుండా రోడ్లను అభివృద్ధి చేయాలని సూచించారు. విశాఖ వేదికగా అనేక కంపెనీలు వస్తున్నందున, దానికి తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్లు సిద్ధం చేయాలన్నారు. ఈ రీజియన్‌లో యువతకు 5 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అలాగే ఐటీ పార్కుల ఏర్పాటుకు అనువైన ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విశాఖ ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక రాజధాని అని పేర్కొన్న లోకేశ్, హైదరాబాద్ 30 ఏళ్లు పడితే.. విశాఖ కేవలం పదేళ్లలో అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2047 నాటికి జీవీఎంసీ ఆర్థిక పరపతిని ఒక ట్రిలియన్ డాలర్లకు చేరుస్తామని లక్ష్యాన్ని ప్రకటించారు. ఈ సమావేశంలో ఐటీ సెక్రటరీ, మేయర్, ఎమ్మెల్యేలు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

రుషికొండ భవనాలను అమ్మితే ప్రతిఘటిస్తాం

- జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు
- ప్రభుత్వ పెద్దల పర్సంటేజీల కోసం రుషికొండ భవనాల అమ్మకం



మధురవాడ: రుషికొండపై ఉన్న అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ప్రభుత్వ భవనాలను తమ 'పర్సంటేజీల' కోసం కూటమి ప్రభుత్వం అమ్మకానికి పెడితే ఉత్తరాంధ్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు హెచ్చరించారు. వేల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను తమ సంపద సృష్టి కోసం తెగనమ్మేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలి

గత ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ సుందరమైన భవనాలను కేవలం ప్రభుత్వ అవసరాల కోసం మాత్రమే ఉపయోగించాలని వాసు డిమాండ్ చేశారు. ఈ భవనాలను రాష్ట్రపతి, ప్రధాన మంత్రి లేక గవర్నర్‌ల బంగ్లాలుగా ఉపయోగించాలని సూచించారు.

'పీపీపీ' అంటే ప్రభుత్వ పెద్దల పర్సంటేజీలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 'పీపీపీ' అంటే .. 'ప్రభుత్వ పెద్దల పర్సంటేజీల కోసం అభివృద్ధి' అనే ముసుగు తొడిగి వేల కోట్ల ఆస్తులను తెగనమ్ముతోందని వాసు ఆరోపించారు. ఈ భరితెగింపు చర్యలపై రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారని ఆయన అన్నారు.

ఉద్యమం తప్పదు

అంతర్జాతీయ ప్రమాణాలు గల రుషికొండ భవనాలు ప్రభుత్వ ఆస్తులుగానే కొనసాగేందుకు జన జాగరణ సమితి పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని వాసు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే ఈ దిశగా ఆలోచనలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నలుగురి జీవితాల్లో వెలుగులు 8లో

ఆరోగ్యశ్రీ సేవలకు తీవ్ర అంతరాయం

మహారాణిపేట: ఆరోగ్యశ్రీలో వైద్య సేవలకు ఆదివారం కూడా తీవ్ర అంతరాయం కలిగింది. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి బకాయిలు చెల్లించకపోవడంతో శుక్రవారం నుంచి అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలుపుదల చేశారు. ఏపీ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్(ఆషా) ఆధ్వర్యంలో నెట్‌వర్క్ ఆస్పత్రులు పేదలకు వైద్య సేవలు నిలిపేశాయి.

కూటమిలో కుప్పిగంతులు

- సేనలో వాళ్లే..సైకిలెక్కింది వాళ్లే. !
- కూటమి పార్టీల్లో వింత చేరికలు
- బలప్రదర్శనలో నవ్వులపాలవుతున్న టీడీపీ, జనసేన



ఎమ్మెల్సీ నాగబాబు..స్థానిక జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్..పార్టీ నాయకుడు బొలిశెట్టి సత్యనారాయణ..ఇతర జనసేన నాయకుల నడుమ జనసేన కండువా కప్పుకున్న ఈశ్వరరావు



ఇదే ఈశ్వరరావు ఆదివారం టీడీపీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ సమక్షంలో కండువా కప్పుకున్న దృశ్యం

డాబాగార్డెన్స్: కూటమిలో కల్లోలం మొదలైంది. ఇందుకు జనసైనికులు, టీడీపీ కార్యకర్తల వైఖరే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతిపక్షంలో ఉన్న కార్యకర్తలు అధికార పక్షంలోకి వెళ్లడం చూస్తుంటాం. కానీ ఇక్కడ విచిత్రంగా, కూటమిలో భాగమైన జనసేన కార్యకర్తలు టీడీపీలోకి, టీడీపీ కార్యకర్తలు జనసేనలోకి మారుతూ 'దోబూచులాట'ఆడుతున్నారు. ఈ వింత పోకడ కూటమిలో గందరగోళానికి దారితీస్తోంది.జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం కూటమి ధర్మాన్ని పాటించాలని, టీడీపీ వారితో అణిగిమణిగి ఉండాలని జనసైనికులకు పదేపదే సూచిస్తున్నారు. అయితే దిగువశ్రేణి జనసైనికులు మాత్రం అధినేత మాటలను పక్కన పెడుతున్నట్లుగా వారి చేష్టల ద్వారా స్పష్టమవుతోంది. దీంతో కింది స్థాయి కార్యకర్తల్లో ఏ స్థాయిలో సమన్వయ లోపం ఉందో ఇట్టే అర్థమవుతోంది.

నిన్నటికి మొన్న..

సేనాని (పవన్ కల్యాణ్) సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు సమక్షంలో 29వ వార్డుకి చెందిన ఈశ్వరరావు అండ్ బృందం జనసేన కండువా కప్పుకుంది. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలోనే జనసేన తీర్థం పుచ్చుకున్నారు. కండువా ఇస్త్రీ మడత చెరిగిపోకముందే..వారంతా టీడీపీ పంచన చేరారు. ఇదీ కూటమి ప్రభుత్వం..నేతల్లో వింత పోకడగా మారింది.

దక్షిణ నియోజకవర్గంలోని 29వ వార్డులో ఆదివారం టీడీపీ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన కొంత మంది యువకులు కార్పొరేటర్ ఉరికూటి నారాయణరావు నేతృత్వంలో టీడీపీ కండువా కప్పుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. జనసేన కార్యకర్తలు టీడీపీలో చేరడంపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

లోకేశ్‌ను సీఎం చేసే వరకు నిద్రపోవద్దు

ఈ కార్యక్రమంలో పాల్గొన్న దక్షిణ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో విస్మయం కలిగించాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఉన్నప్పటికీ, టీడీపీ కార్యకర్తలు లోకేశ్‌ను సీఎం చేసే వరకు నిద్రపోవద్దని ఆయన పిలుపునివ్వడం గమనార్హం. అయితే సుధాకర్ తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ 'చంద్రబాబునాయుడు వచ్చే ఎన్నికల్లో కూడా విజయం సాధించి, మరో ఐదేళ్లపాటు ముఖ్యమంత్రి పదవిలో ఉంటారు. ఆ తర్వాత లోకేశ్ సీఎం పదవి చేపట్టేందుకు ఇప్పటి నుంచే కష్టించి పని చేయాలి' అని వివరణ ఇచ్చారు. పార్టీలో చేరిన ఈశ్వరరావుకు నియోజకవర్గ యువత బాధ్యత అప్పగించినట్లుగా కూడా ఈ సందర్భంగా తెలిపారు.

వంశీకృష్ణను కాదని... సీతంరాజును గెలిపించాలి

మరోవైపు 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు చేసిన వ్యాఖ్యలు జనసేన నాయకులను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. కూటమి తరపున గెలిచిన జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కాదని, వచ్చే ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌ను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి ఇప్పటి నుంచే అడుగులు ముందుకు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. పలువురు జనసేన కార్యకర్తలు టీడీపీలో చేరడంతో పార్టీ బలోపేతమైందని ఉరుకూటి అనడం, నియోజకవర్గంలో జనసేన బలం తగ్గిందన్నట్లుగా ఉందంటూ జనసేన నాయకులు, కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు.

29వ వార్డులో తారాస్థాయికి చేరిన కుంపటి

జీవీఎంసీ 29వ వార్డులో కూటమి నేతల మధ్య అంతర్గత లొల్లి తారాస్థాయికి చేరింది. జనసేన నుంచి టీడీపీలోకి, టీడీపీ నుంచి జనసేనలోకి కార్యకర్తలు చేరడం ఈ గందరగోళాన్ని మరింత పెంచుతోంది. వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావుకి, ఆ పార్టీ వార్డు అధ్యక్షుడి మధ్య గ్యాప్ పెరుగుతుండగా, జనసేన నాయకుల మధ్య కూడా పొరపొచ్చాలు ఎక్కువై, కూటమి కుంపటి రగులుతోంది.

అనుపమకు 'వెంపటి చిన్న సత్యం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'

మద్దిలపాలెం: పద్మభూషణ్ వెంపటి చిన్న సత్యం 96వ జయంతి ఉత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండు రోజుల పాటు వైభవంగా జరిగాయి. విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ , కూచిపూడి కళాక్షేత్ర సంయుక్త నిర్వహణలో ముగింపు రోజున వివిధ నృత్య ప్రదర్శనలతో కళాకారులు నృత్య నీరాజనం పలికారు. కార్యక్రమాన్ని నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి, డాక్టర్ శ్రీధర్ మిత్ర, బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రమ, గురు హరి రామమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ కూచిపూడి ప్రదర్శకురాలు అనుపమ మోహన్‌కు 'వెంపటి చిన్న సత్యం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు' ప్రధానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రియ శ్రీరామ్ (భరతనాట్యం), విశాఖకు చెందిన కళాకారులు కథక్, ఒడిస్సీ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రతి ఏటా ఇద్దరికి రూ. 5,000 నగదుతో కూడిన మెరిట్ స్కాలర్‌షిప్‌ను ప్రవేశపెట్టినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈఏడాది శ్రీ భారతీయ కళాసదన్ విద్యార్థిని కుమారి ఆకెళ్ళ రవళి మనోహరణిని ఎంపిక చేశారు. వీవీడీఏ ప్రధాన కార్యదర్శి కన్నం వెంకటరమణ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకలకు ఫెస్టివల్ కోఆర్డినేటర్స్ మంజుష ,సింధుజ, మహాలక్ష్మి ,కల్యాణి, గోపీనాథ్‌లు వ్యవహరించారు.



అనుపమ మోహన్‌కు వెంపటి చిన్న సత్యం లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు

అడ్డగోలు నిల్వలు..
అనుమతిలేని అమ్మకాలు



వెలుగుల పండగ దీపావళి సమీపిస్తోంది. దీంతో బాణసంచా గుట్టుగా మహా నగరానికి చేరుతోంది. దసరా నుంచే కొందరు వ్యాపారులు ఒడిశా, తమిళనాడుల నుంచి బాణసంచా నిల్వలు తెచ్చినట్టు తెలుస్తోంది. అధికార కూటమి నేతలు చెబితే ఇష్టారాజ్యంగా అనుమతులిచ్చేందుకు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు జీహుజూర్ అంటున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా అక్రమ నిల్వలున్న ప్రాంతాల్లో మాత్రం మొక్కుబడి తనిఖీలతో నిబంధనలు గాలికొదిలేస్తున్నారు.

- విశాఖ జిల్లాలో విచ్చలవిడిగా బాణసంచా నిల్వలు
- తయారీ కేంద్రాలు, అమ్మకాలపై పర్యవేక్షణ లోపం
- ఇష్టారాజ్యంగా అనుమతులకు కూటమి నేతల సిఫార్సులు
- జీ హుజూర్ అంటున్న అధికారులు
- గత ఏడాది 524 షాప్‌లు.. ఈసారి 700కు పెరిగే అవకాశం
- ఇప్పటికే శివారు ప్రాంతాల్లో అక్రమంగా బాణసంచా నిల్వలు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట : దీపావళి పండగకు మరో వారం రోజులే ఉంది. దీంతో బాణసంచా తయారీ కేంద్రాలు, విక్రయ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే లైసెన్సులు రద్దు చేస్తామని అధికారులు మొక్కుబడి హెచ్చరికలు చేస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో నిబంధనలు పాటించకుండా మందుగుండు సామగ్రిని వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఓవైపు పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాల సీజన్ కావడం.. దీపావళి సమీపిస్తుండటంతో.. విశాఖ జిల్లాపై బాణసంచా పడగ విప్పుతోంది. నిత్యావసరాల మాటున ఇప్పటికే పట్టణానికి పెద్దఎత్తున బాణసంచా నిల్వలు చేరుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

అంతా కూటమి కనుసన్నల్లోనే..!

అధికారికంగా దీపావళి సామగ్రి విక్రయించేందుకు ఏయూ మైదానంతోపాటు ఎంవీపీ కాలనీలో ఏఎస్ రాజా కాలేజీ గ్రౌండ్స్, బీచ్ రోడ్డులో ఓ ఫంక్షన్ హాల్, గాజువాక, గోపాలపట్నం, షీలానగర్, స్టీల్‌ప్లాంట్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తుంటారు. ఈ స్టాల్స్‌కు జీవీఎంసీ, రెవెన్యూ, వాణిజ్య పన్నులశాఖ, పోలీసులు, అగ్నిమాపక శాఖ అనుమతులు కావాలి. అయితే.. ఈ ప్రభుత్వ విభాగాల అనుమతులు కావాలంటే.. స్థానిక కూటమి నేతల అనుమతులు తప్పనిసరిగా మారింది. తమ అనుచరులకు, తర్వాత ఎవరు ఎక్కువ మొత్తం ముట్టజెబితే వారికే స్టాల్స్‌కు పర్మిషన్లు ఇవ్వాలంటూ ఇప్పటికే ఆయా విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికార పార్టీ నేతలతో పాటు తామేం తక్కువ తినలేదంటూ.. తమ చేతులు కూడా తడిపితేనే అనుమతులిచ్చేందుకు అధికారులు సైతం సిద్ధమవుతున్నారు. ఈ లెక్కన ఈసారి ఇష్టారాజ్యంగా విక్రయాలకు పర్మిషన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. గతేడాది 524 దుకాణాలకు అనుమతులివ్వగా.. ఈసారి 700 దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

శివార్లలో తయారీ కేంద్రాలు

ఒడిశా, తమిళనాడు నుంచి ఎక్కువగా ఇక్కడికి బాణాసంచా వస్తుంటుంది. విజయనగరం నుంచి కూడా తీసుకొస్తుంటారు. వీటిలో ఎక్కువగా చైనా టపాసులు దిగుమతువుతున్నాయి. బ్రాండెడ్ టపాసులపై 18 శాతం జీఎస్టీతో పాటు బాణసంచా విక్రయ లైసెన్సులపైన మరో 10 శాతం జీఎస్టీ విధిస్తుంటారు. మొత్తం 28 శాతం పన్ను చెల్లించాలి. దీనికి తోడు.. కూటమి నేతలకు, లైసెన్స్ కోసం ఆయా విభాగాధికారులకు ముడుపులు అదనం. దీంతో అధిక లాభాలకోసం కొందరు సొంత తయారీ కేంద్రాల్ని గుట్టుచప్పుడు కాకుండా నడుపుతున్నట్లు సమాచారం. కొంతమంది అనుమతుల్లేకుండా విచ్చలవిడిగా మందుగుండు సామగ్రి తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకుంటున్నారు. పైగా విధివిధానాలను పాటించకపోవడంతో పలు ప్రాంతాల్లో ఈమధ్య కాలంలో భారీ విస్ఫోటనం జరిగి భయానక పరిస్థితులు సంభవిస్తున్న విషయం తెలిసిందే.

విచ్చలవిడిగా ముడిసరకు

బాణసంచా తయారీకి వినియోగించే ముడిసరకు గన్‌పౌడర్, కోల్ పౌడర్, సల్ఫర్, ఐరన్ కోర్, సురేకారం ఎక్కడికక్కడ బహిరంగ దుకాణాల్లో దొరుకుతోంది. దీంతో పలువురు వాటిని కొనుగోలు చేసి స్వయంగా తయారీకి సిద్ధమవుతున్నారు. ఇటీవల విజయదశమి వేడుకల సందర్భంగా భీమిలి నియోజకవర్గం వలందపేటలో మందుగుండు సామగ్రి తయారీకి ప్రయత్నించగా రాత్రివేళ భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తేరుకున్నట్లు నటించిన అధికారులు, పోలీసులు.. ఆనందపురం, పద్మనాభం, భీమిలి, భోగాపురం మండలాల్లో బాణసంచా తయారీ కేంద్రాలపై పోలీసులు దాడులు చేసి భారీ మొత్తంలో మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆనందపురం మండలంలో శొంఠ్యాం, పెద్దిపాలెం, వెల్లంకి, నేరెళ్లు, దిబ్బడిపాలెం గ్రామాల్లో విశాఖ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. పద్మనాభం మండలంలో అర్చకులవానిపాలెం వద్ద ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. చిన్న చిన్నగా పల్లెల్లో విక్రయించేందుకు తయారు చేస్తున్న వారిపై ప్రభుత్వం ప్రతాపం చూపిస్తుందే తప్ప.. కూటమి నేతల అండతో భారీ మొత్తంలో తయారీ కేంద్రాలు నడుపుతున్న వాటివైపు కన్నెత్తి చూడటం లేదు. భీమిలి, పద్మనాభం, రెడ్డిపల్లి, పాండ్రంగి, కొవ్వాడ, కురపిల్లి, నియోజకవర్గ సరిహద్దు ప్రాంతాలు కవులవాడ, తుడాం, బసవపాలెం గ్రామాల్లోనూ భారీ తయారీ కేంద్రాలు ఉన్నట్లు సమాచారం.

అనుమతులు లేకుండానే నిల్వలు

ఇప్పటికే బాణసంచాని తీసుకొచ్చి.. పర్మిషన్లు రాగానే విక్రయించేందుకు వ్యాపారులు అనధికారికంగా ముందస్తు నిల్వలు ఏర్పాటు చేసుకున్నారు. శివారు ప్రాంతాల్లోని గోదాములు, ఇళ్లల్లో గుట్టుచప్పుడు కాకుండా నిల్వ చేశారు. అయితే.. ఇందుకోసం ఫారం–26 ప్రకారం అధికారులు అనుమతులు తీసుకోవాలి. జనావాసాలు, నగర నడిబొడ్డును బాణసంచా నిల్వలు నిషేధం. ఇవేమీ పట్టించుకోకుండా అధికార పార్టీల అండతో.. కొందరు వ్యాపారులు ఇష్టారాజ్యంగా నిల్వలుంచారని తెలుస్తోంది. ఎక్కడెక్కడ నిల్వలున్నాయో అధికారులకు తెలిసినా కూటమి నేతలు అటువైపు వెళ్లొద్దనే ఆదేశాలతో సైలెంట్ మోడ్‌లో పనిచేసుకుంటున్నారు. దీంతో.. వ్యాపారులు ఇష్టం వచ్చినట్లుగా ప్రమాదకరంగా వ్యాపారాలు చేసుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

అంబుజా సిమెంట్స్‌పై పోరాటానికి కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: అదానీ అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు స్థానికులతో కలసి పోరాట కమిటీని నియమించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి తెలిపారు. గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పెదగంట్యాడలో ఆదివారం సాయంత్రం స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబుజా సిమెంట్స్‌ను ఏర్పాటు చేస్తే జరిగే నష్టాలను వివరించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడంతోపాటు ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్నామని గుర్తు చేశారు. ప్రజలు వ్యతిరేకించినా మళ్లీ ప్రజాభిప్రాయ సేకరణను చేపడతామని అధికారులు ప్రకటించడం సరికాదన్నారు. ఈ ఫ్యాక్టరీ కోసం ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో పోరాట కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మార్టుపూడి పరదేశి, పల్లా కార్తీక్, గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ, కొయ్య భారతి, గంట్యాడ గురుమూర్తి, సంపంగి ఈశ్వరరావు, తాటికొండ జగదీష్, మధుసూదన్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, నాగు, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలి

అంబుజా సిమెంట్స్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రద్దు చేయాలని అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. నడుపూరులోని సీడబ్ల్యూసీలో ఆదివారం వ్యతిరేక పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షుడు కృష్ణారావు, సీఐటీయూ నాయకుడు లక్ష్మణమూర్తి, రామారావు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌వో జిల్లా మహాసభ విజయవంతానికి పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌వో సభ్యులు

బీచ్‌రోడ్డు: ఎంతో చారిత్రక ప్రాముఖ్యత కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం సరిపడా అధ్యాపకుల్లేక డిపార్ట్‌మెంట్లకు డిపార్ట్‌మెంట్లే మూతపడుతున్నాయని పీడీఎస్‌వో విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ నెల 15న ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించనున్న పీడీఎస్‌వో 'విశాఖ జిల్లా మహాసభ'ను విజయవంతం చేయాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీకి 111 మంది ప్రొఫెసర్లు, 201 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 414 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు కావాలన్నారు. ఏళ్ల తరబడి పోస్టుల్ని భర్తీ చేయకుండా యూనివర్సిటీని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ హాస్టళ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. తాగునీటి సమస్య, నాసికమైన ఆహారం, రెగ్యులర్ ఆరోగ్య పరీక్షలు నిర్వహించక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని విద్యారంగ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణ రూపకల్పనకు జిల్లా మహాసభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభకు ఏయూ మహాసభకు విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్రవాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కమిటీ సభ్యులు సతీష్‌కుమార్, జానకి, లక్ష్మణ్, ఉదయ్‌కిరణ్, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి'



ఇమంది పైడిరాజు

అరిలోవ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి(ఐఆర్) వెంటనే ప్రకటించాలని స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఆదివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఇంత వరకు ఐఆర్ ప్రకటించలేదన్నారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు కూడా చెల్లించలేదని ఆక్షేపించారు. సాధారణ ఎన్నికల ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇంతవరకు పీఆర్సీ కమిషన్ నియమించకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నట్లు పేర్కొన్నారు. ఈహెచ్ఎస్ కింద ప్రతి ఉద్యోగి నెలానెలా కొంత మొత్తం చెల్లిస్తున్నా.. కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యం అందించేందుకు నిరాకరిస్తున్నాయని వాపోయారు. తక్షణమే ఈ సమస్యలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్థల ఆక్రమణను అడ్డుకున్న గ్రామస్తులు



పాలవలస పంచాయతీలో రాత్రికి రాత్రి నిర్మించిన షెడ్



ఆక్రమణ ప్రాంతంలో టెంట్ వేసి, నిరసన తెలుపుతున్న కూర్చున్న గ్రామస్తులు

తగరపువలస: ఆనందపురం మండలం పాలవలస పంచాయతీ సర్వే నెం.82లో శనివారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు కొండను తొలచి, చెట్లను తొలగించి షెడ్ నిర్మించడాన్ని గ్రామస్తులు పసిగట్టారు. పంచాయతీలో 21 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉండగా సదరు ఆక్రమణదారుడు సుమారు మూడున్నర ఎకరాల్లో చదును చేస్తున్నట్టు గుర్తించారు. ఈ ఆక్రమణకు వ్యతిరేకంగా ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పాక్షికంగా చేపట్టిన షెడ్‌ను అడ్డుకుని కూలీలను చెదరగొట్టారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ పంచాయతీకి ప్రభుత్వ భూమి ఇక్కడ తప్ప మరెక్కడా లేదన్నారు. ప్రస్తుతం ఆక్రమణదారుడు చదును చేస్తున్న మూడున్నర ఎకరాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థానికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదించిందన్నారు. ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియకు ఆటంకం కలిగిందన్నారు. గతంలో ఈ సర్వే నంబర్‌లో ఇద్దరు దళిత వ్యక్తులు, ఒక విశ్రాంత ఆర్మీ ఉద్యోగి తమకు భూములు ఉన్నట్టు ముందుకురాగా తామంతా పార్టీలకు అతీతంగా అడ్డుకున్నామన్నారు. భవిష్యత్తులో కూడా పంచాయతీకి సంబంధం లేని వ్యక్తులు ఇక్కడ ఆక్రమణకు ప్రయత్నిస్తే వారి ఆటలు సాగనివ్వబోమని హెచ్చరించారు. జాతీయరహదారిని ఆనుకుని దుక్కవానిపాలెం టోల్‌గేట్ సమీపంలో ఉన్న ఈ భూమి విలువ ఎకరం రూ.5 కోట్లు పైనే ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఇదే సర్వే నంబర్‌లో కొన్ని ప్రభుత్వ భూములకు సంబంధించి వివాదాలు న్యాయస్థానంలో ఉన్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులే స్వయంగా యంత్రాలు తీసుకొచ్చి సర్వే నెం.82లో జంగిల్ క్లియరెన్స్ చేసుకున్నారు. వీఆర్వో దుర్గా రమేష్ అక్కడకు చేరుకుని ప్రభుత్వ స్థలాల్ని ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఎవరికైనా భూములకు సంబంధించి యాజమాన్య హక్కులు ఉంటే తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు.

మెడికవర్ ఆస్పత్రి పైనుంచి పడి వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ: కోరాపుట్‌కు చెందిన పూజారి నరసింగ్(28) అనే వ్యక్తి ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రి 5వ అంతస్తు నుంచి పడి మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నరసింగ్ కోరాపుట్ జిల్లా కెందుగూడ గ్రామంలో కుటుంబ సభ్యులతో నివసిస్తూ.. స్థానిక ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. కొంతకాలంగా అతను మద్యానికి బానిస కావడంతో పూజారి విధుల నుంచి గ్రామస్తులు తొలగించారు. దీంతో మద్యానికి మరింతగా బానిసయ్యాడు. ఇటీవల అతని స్నేహితురాలు తులసిదాస్ అత్తగారికి అనారోగ్యంగా ఉండటంతో ఆమెతో కలిసి మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చాడు. శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆస్పత్రిలో కనిపించకపోవడంతో అతని భార్య పున్నీ పూజారికి తులసీదాస్ ఫోన్‌చేసి తెలిపింది. అదేరోజు అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆస్పత్రి 5వ అంతస్తు నుంచి పడిపోవడాన్ని సెక్యూరిటీ సిబ్బంది గమనించారు. ఆస్పత్రిలో ఉన్న రోగులను, వారి బంధువులను అప్రమత్తం చేయడంతో చనిపోయిన వ్యక్తి తనతోపాటు వచ్చిన నరసింగ్‌గా గుర్తించి ఆస్పత్రి వర్గాలకు తులసిదాస్ తెలిపింది. అత్యవసర వైద్య విభాగానికి తరలించగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై అతని భార్య పున్నీ పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. తన భర్త మద్యానికి బానిసై కొంత కాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని, ఈ క్రమంలో ఆస్పత్రి పైఅంతస్తు నుంచి పడిపోయి ఉంటాడని, అతని మృతిపై ఎలాంటి అనుమానం లేదని భార్య పున్నీ పూజారి తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు.

నలుగురి జీవితాల్లో వెలుగులు



అన్నపూర్ణ(ఫైల్)

ఆరిలోవ: బ్రెయిన్ డెడ్ మహిళ అవయవాల ద్వారా మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. నగరంలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో జరిగిన ఈ అవయదానం గురించి డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌కు చెందిన కె.అన్నపూర్ణ(50) హనుమంతవాక వద్ద శనివారం రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొని తలకు తీవ్ర గాయమైంది. అధిక రక్తస్రావంతో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు విమ్స్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ఆదివారం నిర్ధారించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబుకు వైద్యులు విషయం తెలిపారు. ఆయన అనుమతితో బ్రెయిన్ డెడ్ అయిన అన్నపూర్ణ శరీరం నుంచి కాలేయం, ఊపిరితిత్తులు, కార్నియాలను సేకరించారు. వాటిని జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం సీనియారిటీ జాబితాను అనుసరించి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో గ్రీన్ చానల్ ద్వారా తరలించారు. సాయంత్ర 6.45కు అన్నపూర్ణ శరీరం నుంచి తొలగించిన అవయవాలను బీఆర్‌టీఎస్ మార్గంలో అడవివరం, సింహాచలం, గోపాలపట్నం, ఎన్ఏడీ మీదుగా విశాఖ ఎయిర్‌పోర్టుకు చేర్చారు. అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా అవయవాలు దానం చేయడానికి ముందుకు వచ్చిన అన్నపూర్ణ కుటుంబ సభ్యులను రాంబాబు అభినందించారు. ఇంతవరకు విమ్స్‌లో బ్రెయిన్ డెడ్ అయిన ఐదుగురు నుంచి అవయవాలు సేకరించి పలువురి జీవితాల్లో వెలుగులు నింపినట్లు తెలిపారు.

వాటే బ్యాటింగ్...!

- విశాఖ స్టేడియంలో పరుగుల వరద
- ఉత్కంఠ పోరులో కంగారూలదే విజయం





రావి కల్పన గేట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్





విశాఖ స్పోర్ట్స్: టీం ఇండియా భారీ స్కోరు..కంగారూలను కలవరపెట్టడం ఖాయం అనుకున్న అభిమానులకు..ప్రొఫెషనల్ ఆటకు బ్రాండ్ మేమే అన్నట్టు ఆస్ట్రేలియా బ్యాటర్లు పరుగుల వరద సృష్టించారు. భారత బౌలర్లను చీల్చి చెండాడారు. కళ్లు చెదిరే బౌండరీలు..బంతికి చుక్కలు చూపించేలా సిక్సర్లతో మోత మోగించారు. ఆస్ట్రేలియా సారథి అలిస్సా హీలీ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. సొగసైన కవర్ డ్రైవ్స్‌లో కళాత్మక బ్యాటింగ్‌తో 142 (107 బంతుల్లో 21 ఫోర్లు, మూడు సిక్సర్లు) చేసింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా జట్టు భారీగా పరుగులు సమర్పించుకుంది. భారత్ జట్టు 330 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు ఆది నుంచి బౌలర్లపై విరుచుకుపడింది. మధ్యమధ్యలో వికెట్లు పడినా ఏ మాత్రం లక్ష్యాన్ని వీడలేదు. ఆస్ట్రేలియా బ్యాటర్లంతా రాణించడంతో మరో ఓవర్ ఉండగానే విజయం సాధించింది. చివరి వరకు మ్యాచ్ నువ్వా–నేనా అన్నట్టు సాగింది. అటు ప్రత్యక్షంగా మ్యాచ్ వీక్షించినవారికి..టీవీల్లో చూసిన అభిమానులకు మ్యాచ్ మజా పంచింది. విశాఖ వైఎస్సార్ స్టేడియం ఇరు జట్ల పరుగుల దాహాన్ని తీర్చింది. అభిమానులు ఆటను ఆస్వాదించారు. ఫోర్లు, సిక్సర్లు బాదినప్పుడల్లా మువ్వెన్నల జెండా రెపరెపలాడింది.

అంతకుముందు స్టేడియంలోని ఏ గ్యాలరీ స్టాండ్‌కు భారత మాజీ మహిళా జట్టు కెప్టెన్ మిథాలీరాజ్ పేరుతోనూ, స్టేడియంలోకి మూడో ప్రవేశద్వారానికి స్థానిక క్రీడాకారిణి రావి కల్పన పేరుతో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ చైర్మన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మ్యాచ్‌ను రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారాలోకేష్ , ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సానా సతీష్ బాబు వీక్షించారు.





భక్తి మార్గంలో తొలి అడుగు.. శ్రీప్రభుపాద ఆశ్రయం



శ్రీప్రభుపాద ఆశ్రయం పొందిన భక్తులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంపీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధా మదన్ మోహన్ మందిరంలో 120 మంది భక్తులు ఆదివారం శ్రీ ప్రభుపాద ఆశ్రయం స్వీకరించారు. ఈ సందర్భంగా మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ ప్రభుపాద ఆశ్రయం అంటే హరేకృష్ణ ఆధ్యాత్మిక మార్గంలో ఆధ్యాత్మిక వికాసం కొరకు ప్రభుపాదుని గురువుగా స్వీకరించడమని తెలిపారు. ఆశ్రయం స్వీకరించిన భక్తులు ఇకపై రోజూ హరేకృష్ణ మహామంత్ర జపం చేస్తూ శ్రీభక్తి వేదాంత స్వామి ప్రభుపాద రచించిన భగవద్గీత, భాగవతం వంటి రచనలు చదువుతూ సాధన చేయాలన్నారు. టీ, కాఫీ తీసుకోరాదని, పందెం, జూదం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం దామోదర దీపోత్సవంలో భాగంగా దామోదర అష్టకం వివిధ సంగీత వాయిద్యాల నడుమ లయబద్ధంగా ఆలపించారు. శ్రీరాధా మదన్ మోహన్‌లకు నెయ్యి దీపాలతో హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో జితమిత్ర దాస స్వామీజీ, అంబరీస దాస భక్తులకు దామోదర దీపోత్సవం ప్రాముఖ్యతను వివరించారు.

అదరగొట్టిన 'గ్లామ్ రన్ వే'



బీచ్‌రోడ్డు: నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన 'గ్లామ్ రన్ వే' ..'డ్యాన్స్ టోపియా' మెగా ఫైనల్ కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకుంది. మూడేళ్ల నుంచి 14 ఏళ్ల వయసున్న చిన్నారులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.ర్యాంప్ వాక్ విభాగంలో పిల్లలు ఇండియన్ ట్రెడిషన్, బీచ్, అల్ట్రా స్టైలిష్ వంటి రౌండ్లలో నడిచి మెరిశారు. డ్యాన్స్ టోపియాలో సోలో – గ్రూప్ విభాగాలలో తమ నృత్య ప్రదర్శనలతో వేదికను అదరగొట్టారు. ఈ పోటీలకు హేమలత రెడ్డి, సంతోష్, ప్రీతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించగా, అభయ్ అరోరా ప్రత్యేక ప్రదర్శన అలరించింది. విజేతలకు సిరి మెకోవర్స్ సౌమ్య, నైరా గోల్డ్ మనోజ్ అవార్డులు, కిరీటాలు బహూకరించారు. ఈ చిట్టి మోడల్స్‌తో ప్రత్యేక క్యాలెండర్‌ను రూపొందిస్తామని నిర్వాహకులు వీరు మామ తెలిపారు.

తీరానికి చేరిన మత్స్యకారుడి మృతదేహం



తీరానికి చేరిన బంగార్రాజు మృతదేహం

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరంలో చేపల వేటకు వెళ్లి సముద్రంలో గల్లంతైన అరిజిల్లి బంగార్రాజు(17) మృతదేహం ఆదివారం ఉదయం దిబ్బపాలెం తీరానికి చేరింది. తోటి మత్స్యకారులతో కలిసి శనివారం తెల్లవారుజామున చేపలు వేటకు వెళుతున్న క్రమంలో కెరటాల తాకిడికి బంగార్రాజు పడవ నుంచి సముద్రంలోకి జారి, గల్లంతయ్యాడు. ఉదయం నుంచి రాత్రి వరకు మృతదేహం కోసం గాలించినా ఫలితం కనిపించలేదు. ఆదివారం ఉదయానికి మృతదేహం తీరానికి చేరింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న వెంటనే పరవాడ ఎస్ఐ బి.కృష్ణారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.